## క్లుప్తంగా

### అన్నదానం

కొడవలూరు: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలోని నార్తురాజుపాళేనికి చెందిన 'వనమా శేషయ్య, పద్మావతమ్మ చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో స్థానిక ట్రస్ట్ కార్యాలయం వద్ద, రామాలయం వద్ద, టపాతోపు విశ్వజనని అనాథాశ్రమాల్లో గురువారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు దొరడ్ల సత్యనారాయణ – లలితమ్మ దంపతులు మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేబడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు దొరడ్ల శశిధర్, వెంకటసుప్రజ, ఉదయ్‌కిరణ్, కాంచన లక్ష్మి, సిద్దా లక్ష్మీతనూజ, రామకృష్ణ పాల్గొన్నారు.

### ఆశ్రమంలో బాలలకు క్విజ్ పోటీలు



కొడవలూరు: మండలంలోని టపాతోపు విశ్వజనని ఆశ్రమంలోని బాలలకు గురువారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆశ్రమంలోని బాలబాలికలను ఏబీసీడీ గ్రూపులుగా విభజించి ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీ–గ్రూపు బాలురు మొదటిస్థానంలో నిలిచారు. వీరికి సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మాధవి చేతులమీదుగా సైకిల్ బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమంలోని బాలబాలికలు పోటీ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఆశ్రమ నిర్వాహకులు బుర్లా శ్రీలక్ష్మి, ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ ప్రతి నెలా బాలలకు క్విజ్ పోటీలు నిర్వహించడం ద్వారా విద్యాప్రమాణాలు పెంపొందించాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు రాజ్యలక్ష్మి, శ్రీనివాసులు, శ్రేష్ట చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు హేమంత్‌కుమార్, సభ్యుడు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

### రైతు సంక్షేమానికి సొసైటీ కృషి



కోవూరు: మండలంలోని పడుగుపాడు సొసైటీని ప్రారంభించి దాదాపు 102 ఏళ్ల పూర్తయిందని, రైతుల సంక్షేమమే కోసమే ఈ సొసైటీ కృషి చేస్తోందని సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో గురువారం మహాజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రాంగణంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలో ఉన్న 10 గ్రామాల్లో రైతులకు అవసరమైన అన్ని రుణాలను అందజేశామన్నారు. కోవూరు, చెర్లోపాళెం వేగూరు, కోవూరు, పోతిరెడ్డిపాళెం, పాటూరు గ్రామాల్లో ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాములను నిర్మాణం చేపడుతున్నామన్నారు. సొసైటీలో లాకర్ సదుపాయం కలదని తెలిపారు. ఇనమడుగు గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోలు బంకు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డీసీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. 75సార్లు రక్తదానం చేసిన దేవిరెడ్డి సురేష్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు గునపాటి ప్రసాద్‌రెడ్డి, సొసైటీ రాఘవయ్య, బ్యాంకు మేనేజర్ సుధాకర్, డైరెక్టర్లు అంబటి ప్రసాద్, గున్నం జనార్దన్, మండల ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పొత్తు లేనిదే పూట గడవదు

కోవూరు: ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడికి పొత్తు లేనిదే పూట గడవదని, అయితే టీడీపీ నాయకులు, ఆ పార్టీ కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ గురించి.. తమ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి గురించి విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని డీసీఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీని ఎన్టీ రామారావు ఒక ఆశయంతో ప్రారంభించగా, చంద్రబాబునాయుడు కుట్రలతో ఆ పార్టీని తన పరం చేసుకుని ఎన్టీఆర్‌ను మానసికంగా హత్య చేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని, పేద ప్రజలందరూ లబ్ధి పొందుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. రైతాంగం కోసం పనిముట్లు కొనుగోలు విషయంలో రైతు నచ్చిన కంపెనీని ఎంపిక చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని విమర్శించే హక్కు టీడీపీ నేతలకు లేదన్నారు. కేవలం టీడీపీ నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకే విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ కవరగిరి ప్రసాద్, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు మల్లవరపు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్



విశేషాలంకారంలో సీతారాములు



కళ్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు



పార్థసారథినగర్‌లో..



పరమేశ్వరినగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో..

నెల్లూరు(బృందావనం): శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణ మహోత్సవాలను నగరంలో గురువారం వేడుకగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు ఆలయాలకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. భక్తులకు పానకం, వడపప్పు, మజ్జిగ, తీర్థప్రసాదాలు, అక్షతలను అందజేశారు.

➡ పప్పులవీధిలోని మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీనివాస వైష్ణవి కోలాట మండలి ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శనను జరిపారు. 500 మందికిపైగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఉభయకర్తలుగా బాలాజీ, శకుంతలాదేవి, పాదర్తి బాలాజీ, రూపాదేవి దంపతులు వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, శ్రీరామ్ సురేష్, గోపాల్, ఈఓ కామేశ్వరరావు పాల్గొన్నారు.

➡ మూలాపేటలోని పరమేశ్వరినగర్‌లో గల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలను బ్రహ్మజ్ఞాని రాఘవేంద్రగోపీస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉభయకర్తగా సాయిఅంజనీష్ వ్యవహరించారు.

➡ భక్తవత్సలనగర్‌లోని రాజు కాంప్లెక్స్ సమీపంలో గల సీతారామాంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులకు ప్రసాదాలు, మజ్జిగను భవన నిర్మాణ కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో అందజేశారు. నిర్వాహకులు శ్రీనివాసులు, అంకారావు, రాజు, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

➡ భగవంతుడి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. విజయమహల్ గేట్ వద్ద సీతారాముల కల్యాణోత్సవాన్ని వ్యాపార మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.

➡ కాపువీధిలో వెంకయ్యస్వామి వారి పూజ, హోమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత నరేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. మండపాలవీధిలోని సీతారాముల ఆలయం, కుక్కలగుంటలోని మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్పొరేటర్లు వేలూరు మహేష్, రామకృష్ణ ఆచారి, రంగనాథస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, ఆప్కాఫ్ చైర్మన్ అనిల్‌బాబు, పార్టీ నేతలు సుబ్బారెడ్డి, సిద్దిఖ్, తదితరులు పాల్గొన్నారు

➡ ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీరామనవమి ప్రాధాన్యాన్ని రాఘవాచార్యులు వివరించారు. వాకర్స్‌కు వడపప్పు, పానకం, విసనకర్రలను బలరామయ్యనాయుడు, శ్రీనివాసులునాయుడు, జయరామనాయుడు అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, కోశాధికారి నజీర్ అహ్మద్, కేబినెట్ ట్రెజరర్ శ్రీమన్నారాయణ, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

➡ నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి సన్నిధిలో సీతారామస్వామికి తిరుమంజనం, కల్యాణ మహోత్సవం, రామావతారఘట్ట పురాణ పఠనాన్ని నిర్వహించారు. హనుమంతసేవను రాత్రి జరిపారు. ఉభయకర్తలుగా పురుషోత్తమరావు, తదితరులు వ్యవహరించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

➡ సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ మందిర ప్రాంగణంలో గల అష్టలక్ష్మి ఆలయంలో సీతారామ కల్యాణాన్ని నిర్వహించారు. రామచంద్రమూర్తి అలంకారంలో కృష్ణుడు దర్శనమిచ్చారు. కార్యసిద్ధి హనుమాన్ మందిరంలో సింధూర పూజను నిర్వహించారు. గణపతి సచ్చిదానంద జ్ఞానబోధ సభ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

➡ నగరంలోని ఇస్కాన్ మందిరంలో శ్రీరామ నవమి వేడుకలను మందిరాధ్యక్షుడు సుఖదేవ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.

➡ శెట్టిగుంట రోడ్డులోని వీవర్స్‌కాలనీలో గల పట్టాభిరామస్వామి దేవస్థానంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ దంపతులు హాజరయ్యారు. స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు.

నెల్లూరు రూరల్: ముత్తుకూరు రోడ్డులోని పార్థసారథినగర్‌లో గల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆ ప్రాంత వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నిర్వాహకులు శ్రీకాంత్, మురళి, సుబ్బానాయుడు, చైతన్య పర్యవేక్షించారు.

నెల్లూరు(బారకాసు): గోమతినగర్‌లోని సాయిహృదయ మందిరంలో సీతారామస్వామి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సత్య సాయి సేవా సమితి గౌరవాధ్యక్షుడు మురళీకృష్ణ, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, కన్వీనర్ శేషగిరిరావు పర్యవేక్షించారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గాంధీగిరిజన కాలనీలోని రామాలయంలో కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులకు విసనకర్రలను పంపిణీ చేశారు. ఉభయకర్తలుగా వెంకటరమణ, ప్రియాంక దంపతులు వ్యవహరించారు. దాదాపు రెండు వేల మందికి అన్నదానాన్ని ఎస్సై వెంకయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామోత్సవాన్ని సాయంత్రం జరిపారు. రామచంద్రయ్య, ప్రభాకర్, సుబ్రహ్మణ్యం, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, అర్చకుడు శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.



రంగనాథస్వామి దేవస్థానంలో..



ఇస్కాన్‌లో..



అన్నదానం



సాయిహృదయ మందిరంలో..



గాంధీగిరిజన కాలనీలో..



కృష్ణ మందిరంలో..

## ప్రతిభ పురస్కారాల ప్రదానం



నెల్లూరు(బృందావనం): మాగుంట లేఅవుట్లోని సన్నిధి కార్యాలయంలో శ్రీరామనవమిని సన్నిధి ప్రచురణల సంస్థ అధినేత భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా సన్నిధి ప్రతిభ పురస్కారాలను పలువురికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు వెంకటప్పయ్య, ప్రభాకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సంగీత, సాహిత్య సమ్మేళనం



నెల్లూరు(బృందావనం): మినీబైపాస్ రోడ్డులో ని నర్సరీలో సంగీత, సాహిత్య సమ్మేళనాన్ని గోవిందరాజు సీతాదేవి సాహితీ వేదిక అధ్యక్షురాలు సుభద్రాదేవి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని పూజా కార్యక్రమాలను చేపట్టారు. రామ దాసు, త్యాగరాజ కీర్తనలు, రామచంద్రమూర్తిపై భక్తిగీతాలను ఆలపించారు. హాజరైన వారిని సత్కరించి పూల మొక్కలను అందజేశారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ నీలగిరి సంఘం ఫీడర్‌లో మరమ్మతులు, విద్యుత్ టవర్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సరఫరా శుక్రవారం ఉండదని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీనరసింహపురం, రామాలయం వీధి, బారాషహీద్ దర్గా, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

### వేడుకగా గంధ మహోత్సవం



కావలి : శ్రీరామ నవమి సందర్భంగా పట్టణంలో సాయిబాబా గంధ మహోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తొలుత బాబాను చందనంతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సాయిబాబా విగ్రహాన్ని విశేషంగా అలంకరించి గంధంతో పాటు ఊరేగించారు. హిందూ, ముస్లింలు పాల్గొని ఐక్యతను చాటారు. సహజకవి వీరకృష్ణ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. గంధోత్సవంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అల్లూరు: శ్రీరామ నవమి సందర్భంగా అల్లూరుపేటలో షిర్డీ సాయిబాబా చావడి గంధ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయిబాబా చిత్రపటాన్ని విశేషంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. మసీద్‌సెంటర్‌లోని దర్గా, కోనేటిమిట్టలోని దాదాదాదీ దర్గా వద్ద హిందూ, ముస్లింలు కులమతాలకు అతీతంగా గంధానికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

### ఆంజనేయస్వామికి పూజలు



నెల్లూరు(బృందావనం): సంతపేటలోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణాన్ని భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. తిరుచ్చి ఉత్సవం, కమలం అలంకారాన్ని నేత్రపర్వంగా జరిపారు. ఉభయకర్తలుగా శ్రీరామ్మూర్తి, విజయ్‌కుమార్, సురేఖ, సాయిరామ్, గిరి వ్యవహరించారు. ఈఓ దర్గయ్య పర్యవేక్షించారు.

### మూలాపేటలో అన్నదానం



నెల్లూరు(అర్బన్): మూలాపేటలోని శివగిరికాలనీలో దాదాపు 100 గిరిజన కుటుంబాలకు అన్నదానాన్ని గురువారం నిర్వహించారు. నగరానికి చెందిన మురళి, స్వరూప మేనల్లుడు సైనేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారని విశ్వమాత సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్యాణి పేర్కొన్నారు. సభ్యులు రాధమ్మ, రాము, వరలక్ష్మమ్మ, మురళీమోహన్‌రాజు, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### అంబాపురంలో ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణల తొలగింపు



పోలీస్ బందోబస్తు

నెల్లూరు రూరల్: అంబాపురంలో ఆక్రమణలను రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో గురువారం తొలగించారు. కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో దళితులు, మరో వర్గానికి చెందిన వారు ఆక్రమించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఆర్డీఓ మలోల, రూరల్ ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బయ్య, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ, తదితరులు ఈ ప్రాంతానికి చేరుకున్నారు. వాగ్వాదం అనంతరం ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడారు. సదరు స్థలం ప్రభుత్వానికి చెందిందని, ఇందులోకి ఎవరూ ప్రవేశించకూడదని స్పష్టం చేశారు. ఆక్రమణదారులు తమ సామగ్రిని తీసుకెళ్లారు.

**12 మంది అరెస్ట్**

నెల్లూరు సిటీ: అంబాపురం పరిధిలోని ప్రభుత్వ స్థలం వద్ద ఆక్రమణలకు యత్నిస్తున్న 12 మందిని వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

## క్రైమ్ కార్నర్

### నగదును దోచుకున్న ఇద్దరి అరెస్ట్

నెల్లూరు సిటీ: నగదును దోచుకున్న ఘటనలో ఇద్దర్ని చిన్నబజార్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వివరాలు.. హరనాథపురానికి చెందిన వెంకటేష్ ఎం – 1 థియేటర్స్ రోడ్డులో బుధవారం వెళ్తుండగా, లోకేష్, ప్రసన్నకుమార్ అడ్డుకొని నగదును దోచుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై సైదులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు.

### బైక్ చోరీ

నెల్లూరు సిటీ: బైక్ చోరీకి గురైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. బీవీనగర్‌కు చెందిన మిథున్‌బాబు గూడూరులోని పంచాయతీరాజ్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రోజూ తన బైక్‌పై వేదాయపాళెం రైల్వేస్టేషన్‌కు వచ్చి అక్కడే బైక్‌ను నిలిపేవారు. ఈ క్రమంలో ఫిబ్రవరి తొమ్మిదిన బైక్‌ను అక్కడ పార్క్ చేసి విధులకెళ్లారు. అనంతరం తిరిగొచ్చేసరికి బైక్ మాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### వ్యక్తిపై దాడి

బుచ్చిరెడ్డిపాళెం: ఇంటి హద్దుల విషయమై పేరం కామిరెడ్డి అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరచిన ఘటన బుచ్చిరెడ్డిపాళెంలోని గాంధీనగర్‌లో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు గాంధీనగర్‌కు చెందిన పేరం కామిరెడ్డి, ఆవుల గీతాలక్ష్మి మధ్య ఇంటి స్థల హద్దుల విషయంలో గత కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ఈ విషయంపై గురువారం ఇద్దరి మధ్య మరోసారి వాగ్వాదం జరగడంతో గీతాలక్ష్మి రేకుతో కామిరెడ్డిపై దాడి చేసి గాయపరిచింది. అలాగే గీతాలక్ష్మి కుమారుడు వంశీకృష్ణ కూడా రాయితో కామిరెడ్డిపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు కామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### మైనార్టీలకు విరివిగా రుణాలివ్వాలని వినతి

ముత్తుకూరు: జాతీయ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనార్టీలకు విరివిగా రుణాలు ఇవ్వాలని కేంద్ర మైనార్టీ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి జాన్ బర్లాను కోరినట్లు జాతీయ మైనార్టీ కమిషన్ సలహా సభ్యుడు అబ్దుల్ షఫీవుల్లా తెలిపారు. ఢిల్లీలో గురువారం జరిగిన వార్షిక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి 15 సూత్రాల పథకాన్ని విస్తృతంగా అమలు చేయాలని కమిషన్ చైర్మన్‌ను కోరామన్నారు.

### పొట్టేళ్ల అపహరణపై ఫిర్యాదు

ఆత్మకూరు: గొర్రెల దొడ్డిలోని మూడు పొట్టేళ్ల అపహరణపై జీవాల పెంపకందారుడు వైద్యుల సుధీర్ ఆత్మకూరు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. వివరాలు..ఆరవేడు గ్రామానికి చెందిన సుధీర్ గొర్రెలు మేపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండ్రోజుల క్రితం రోజూలాగే పొలం నుంచి తిరిగి వచ్చిన గొర్రెలను సాయంత్రం దొడ్డిలో తోలాడు. ఉదయం లేచి చూడగా మూడు పొట్టేళ్లు కనిపించలేదు. చుట్టుపక్కల విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై సాయి ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### త్రుటిలో తప్పిన ప్రమాదం

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప సమీపంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గురువారం కారు అదుపుతప్పి హైవే ఫ్లయిఓవర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు, ప్రత్యక్షసాక్షుల వివరాల మేరకు.. కాణిపాకం నుంచి ఒంగోలు వెళుతున్న కారు ఫ్లయిఓవర్‌పై ప్రమాదవశాత్తు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. డ్రైవర్ చాకచక్యంగా కారును అదుపు చేయడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. కారులోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కాగా ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని బిట్రగుంట పోలీసులు తెలిపారు.

## పోలీస్‌స్టేషన్‌కు వాస్తు దోషమట



మూసేసిన మార్గం

నెల్లూరు(క్రైమ్): ఇప్పటి వరకు మనం ఇళ్లు, షాపింగ్‌మాల్స్, అపార్ట్‌మెంట్లకు వాస్తు దోషమని విని ఉంటాం. పోలీస్‌స్టేషన్‌కు వాస్తు దోషమని ఎప్పుడైనా విన్నారా?.. వినకపోతే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. నెల్లూరులోని దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌కు వాస్తు దోషం ఉందని.. దీంతో లేనిపోని చిక్కులు, అనవసరమైన తలనొప్పులు వస్తున్నాయంటూ.. అక్కడి అధికారులు స్టేషన్ ప్రాంగణంలోకి వెళ్లే ప్రధాన రహదారి గేటును మూసేశారనే ప్రచారం జరుగుతోంది. ఎవరూ గేటు తీయకుండా తాళం వేశారు. మరో మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తున్నామని సిబ్బంది చెప్తున్నారు. గతంలో ఇక్కడ ఎంతోమంది అధికారులు పనిచేశారని.. వారికి రాని వాస్తు దోషం ఇప్పుడొచ్చిందానంటూ పలువురు విమర్శిస్తున్నారు.